

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

మెజార్టీ స్థానాలను గెలిచేలా సహకరించాలి

» మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నియోజకవర్గంలో మొదటి విడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలిచేలా అందరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులను కోరారు. గురువారం నియోజక వర్గంలోని అన్ని మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడుతూ ప్రచారం నిర్వహించాలని అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రజల ముందు పెడుతూ మద్దతు కూడా కట్టాలని సూచించారు. ఎక్కడ కూడా అశ్రద్ధ వహించవద్దని గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడాలని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ప్రేమ్‌కుమార్, మినుకూరి రాంరెడ్డి, గోపిగౌడ్, పార్టీ అధ్యక్షుడు బాలచంద్రన్, మధుసూదన్‌రావు, బల్వంత్‌రావు, రాజాగౌడ్, బాలమణి, గూడెం బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నామినేషన్‌లు షురూ

» మొదటి రోజు భారీగానే నామినేషన్‌లు
» 167 సర్పంచ్ స్థానాలకు 115 నామినేషన్‌లు
» 1,520 వార్డులకు 95 నామినేషన్ దాఖలు
» నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నామినేషన్‌ల ప్రక్రియ గురువారం మొదలైంది. జిల్లాలోని కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 167 సర్పంచ్, 1520 వార్డు స్థానాలకు గాను నామినేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే నిర్ధేశించిన క్లస్టర్‌ల పరిధిలో 65 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే వారి నుంచి సంబంధిత ఎన్నికల అధికారులు నామినేషన్‌లు స్వీకరించారు. మొదటివిడత ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి డివిజన్ పరిధిలోని మాచారెడ్డి నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాచారెడ్డి, రామారెడ్డి మండలాల్లోని పలు నామినేషన్ కేంద్రాలను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.


సర్పంచ్‌కు 115, వార్డులకు 95 నామినేషన్‌లు

కామారెడ్డి డివిజన్‌లోని ఆయా మండలాల్లోని సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి రోజు 167 సర్పంచ్ స్థానాలకు 115 నామినేషన్‌లు దాఖలయ్యాయి. అదేవిధంగా 1520 వార్డు స్థానాలకు గాను 95 నామినేషన్‌లు వచ్చాయి. భిక్కనూరు మండలంలో 18 సర్పంచ్ స్థానాలకు గాను 15 నామినేషన్‌లు దాఖాలు కాగా 182 వార్డులకు గాను 8 నామినేషన్‌లు వచ్చాయి. బీబీపేటలో 11 సర్పంచ్ స్థానాలకు 11, 110 వార్డుస్థానాలకు 6 నామినేషన్‌లు రాగా, దోమకొండలో 9 స్థానాలకు గాను 8, 96 వార్డులకు 13 నామినేషన్‌లు రాగా, కామారెడ్డిలో 14 సర్పంచ్ స్థానాలకు 14, 120 వార్డు స్థానాలకు 15, మాచారెడ్డిలో 25 సర్పంచ్ స్థానాలకు 14, 196 వార్డులకు 2, పల్వంచలో 12 సర్పంచ్ స్థానాలకు 6, 110 వార్డులకు 6, రాజంపేటలో 18 సర్పంచ్ స్థానాలకు 9, 158 వార్డులకు 9, రామారెడ్డిలో 18 సర్పంచ్ స్థానాలకు 15, 166 వార్డులకు 14, సదాశివనగర్‌లో 24 సర్పంచ్ స్థానాలకు 14, 214 వార్డులకు 13, తాడ్వాయిలో 18 సర్పంచ్ స్థానాలకు 9, 168 వార్డు స్థానాలకు 9 నామినేషన్‌లు వచ్చాయి.

స్థానిక సమరానికి

స్థానిక ఎన్నికలకు సిద్ధం అంటున్న రాజకీయ పార్టీలు

స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు సై అంటే సై అంటూ కాళ్లు దువ్వుతున్నాయి. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికలపై కార్యాచరణను రూపొందిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రయత్నాల్లో ఉంది. ఈ ఎన్నికల్లోనైనా సత్తా చాటేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిరిగానే జిల్లాలో తన పట్టు నిలుపుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.




» క్షేత్రస్థాయిలో ఫోకస్ పెట్టిన వైనం
» అభ్యర్థుల ఎంపిక కోసం ప్రధాన పార్టీల దృష్టి
» ఎమ్మెల్యేల వద్దకు కాంగ్రెస్ ఆశావహులు
» ఆశావహుల జాబితా సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్
» సన్నాహక సమావేశాలతో బీజేపీ

కామారెడ్డి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో మాత్రం ప్రధాన పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు జరగనుండగా అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అందుకు సిద్ధమవుతున్నాయి. అత్యధిక స్థానాల్లో తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు అధికార కాంగ్రెస్ భావిస్తుండగా, మెజార్టీ స్థానాల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ నేనంటూ అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలుపొందాలని కమలం పార్టీ పావులు కలుపుతోంది.

కాంగ్రెస్‌లో నెలకొంటున్న పోటీ

అధికార కాంగ్రెస్ పార్టీ ఆయా సర్పంచ్, వార్డు స్థానాల్లో గెలిచే మద్దతుదారుల ఎంపిక కోసం నియోజకవర్గాల వారీగా ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నారు. గతంలోనే నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించిన విషయం తెలిసిందే. గతంలో చేపట్టిన సర్వేలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ వారిగా కమిటీలను ఎంపిక చేశారు. అందులో నుంచి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు స్ర్కీనింగ్ చేపడుతున్నారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయాలనుకునే వారు మద్దతు ఇవ్వాలంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీల వద్దకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేయాలనుకునే అభ్యర్థులను స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ఆయాగ్రామాల్లో ప్రకటించారు.



అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ కసరత్తు

సర్పంచ్, వార్డు మెంబర్‌ల స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్ననాయకుల జాబితాను బీఆర్ఎస్ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా సర్పంచ్ స్థానం కోసం పోటీ నెలకొంటుంది. రిజర్వేషన్లు అనుకూలించిన పలువురు పార్టీ మద్దతుదారులు స్థానికంగా మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ఆశిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు మం డలాల వారీగా ఆశావహుల పేర్లను రాసుకుంటున్నారు. నియోజకవర్గాల్లోని ముఖ్యనేతలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని స్థానాల్లో పోటీకి బీజేపీ ప్రయత్నాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. గత పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైతే సత్తా చాటామో అలానే ఈ ఎన్నికల్లోనూ సత్తా చాటి గెలవాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలు కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీజేపీకి గ్రామాల్లో అనుకూల వాతావరణం ఏర్పడింది. ప్రధానంగా యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. దీన్ని అనుకూలంగా మార్చుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యాచరణను ప్రారంభించింది.



ఆలయంలో పూజ చేస్తున్న ఏసీపీ దంపతులు

కాలభైరవ స్వామి ఆలయంలో నిజామాబాద్ ఏసీపీ పూజలు

రామారెడ్డి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారెడ్డి ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో నిజామాబాద్ ఏసీపీ ఎర్రంశెట్టి రాజశేఖర్ దంపతులు గురువారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మద్దికుంట అటవీ ప్రాంతంలో గల బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆయా ఆలయాల్లో ఏసీపీ దంపతులను సన్మానించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు శ్రీనివాస్‌శర్మ, వంశీశర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

» ఎకరాకు రూ. 25వేలు పరిహారం తక్షణమే అందించాలి
» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్



నాగమడుగు ఎత్తిపోతల పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న కవిత

నాగిరెడ్డిపేట/లింగంపేట/నిజాంసాగర్/మహమ్మద్‌నగర్/బాన్సువాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో మంజీరా నది నీటి వల్ల వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురై పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికీ ప్రభుత్వం ఒక్క రూపాయి అందించలేదని, రైతులను ఆదుకోలేదని, తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు ప్రభుత్వం అందించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆమె గురువారం చేపట్టిన 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రం సమీపంలోని బంజారా తండా వద్ద ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో సుమారు 17 గ్రామాల్లో చేతికొచ్చిన పంటలు భారీ వర్షాలతో నిజాంసాగర్ బ్యాక్ వాటర్ కారణంగా మంజీరా నీటిలో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి మండలంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు. రైతులు పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి సైతం నష్టపోయారని ప్రభుత్వం ఇప్పటి వరకు వారిని ఆదుకోలేదన్నారు. వెంటనే పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతుల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు తీరడం లేదు

లింగంపేట మండల కేంద్రంలో కవిత రోడ్ షో నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఆమె మాట్లాడారు. మండలంలో ఇప్పటికీ అనేక మంది రైతులకు పట్టా పాసు పుస్తకాలు రాలేదని రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు తీరడం లేదని ఆమె (మిగతా 8లో..)

వరి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి

» కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను ఈనెల చివరిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వరి కొనుగోలు ప్రక్రియపై ఐకేపీ, సివిల్ సప్లయ్ తదితర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే వరి సేకరణ, తూకాలు, రవాణా తదితర చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద తగిన సంచులు, వాహనాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల వరి పంటను పూర్తిగా కొనుగోలు అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌డీవో తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ సెంటర్ల ఏర్పాటు

పత్తి రైతుల సౌకర్యార్థం సీసీఐ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. మద్నూర్ సీసీఐ సెంటర్‌కు దూరంగా ఉన్న మండలాల రైతులకు వేములవాడ, దౌల్తాబాద్, సిద్దిపేట, తొగుట్ట సీసీఐ సెంటర్‌లలో పత్తిని అమ్ముకోవచ్చని తెలిపారు. స్లాట్ బుకింగ్‌లలో ఈ సెంటర్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతీ ఎకరాకు 7 క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి వచ్చిన రైతులు తమ ఏఈవో వద్దకు వెళ్లి అదనపు దిగుబడిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత సంబంధిత రైతులకు సీసీఐ కేంద్రాల్లో నేరుగా పత్తి అమ్ముకునే అనుమతి లభిస్తుందని తెలిపారు.

రైతుల చూపు మొక్కజొన్న వైపు

» పత్తి, సోయా కలిసి రాక మక్క సాగు
» ఈ ఏడాది 7వేల ఎకరాల్లో సాగు



7

గల్ఫ్ టు గల్లీ

» పంచాయతీ ఎన్నికలపై గల్ఫ్ కార్మికుల ఆసక్తి
» పోటీకి సిద్ధమవుతున్న యువత
» రిజర్వేషన్లపై బంధువులతో ఆరా
» వచ్చి పోటీ చేసేందుకు మొగ్గు

6

చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు

» మహిళల రక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి
» ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప



నిజామాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్ఐ బాలికలు

నిజామాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విద్యారంగానికి నిధులు తగ్గించడంతో పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర గర్ల్స్ స్థాయి అమ్మాయిల ర్యాలీ నిర్వహించారు. గురువారం నిజామాబాద్‌లో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి న్యూ అంబేద్కర్ భవన్ వరకు భారీ ర్యాలీ తీసి అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ రాష్ట్రగర్ల్ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప మాట్లాడుతూ మహిళలను వంటింటికే పరిమి తం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యారంగానికి ప్రత్యేకంగా లాభమేమీ లేదన్నారు. విద్యార్థులు దేశ సేవ కోసం రాజకీయాల్లోకి రావాలని అన్నారు. యూనివర్సిటీల్లో అనేక సమస్యలున్నా వాటిని పరిష్కరించడం లేదన్నారు. కేంద్రం రాజ్యాంగ స్ఫూర్తికి ఆటంకం కలిగిస్తుందన్నారు. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో ఎస్ఎంఎస్ హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిచాలన్నారు. ఈ కార్యక్రమంలో మమత, దీపిక పాల్గొన్నారు.

'సిటీ' మారో..

» లోకల్ బస్సులపై చిగురిస్తున్న ఆశలు
» నిజామాబాద్ నగరంలో సిటీ బస్టాండ్ కోసం కేంద్రం నిధులు
» 10 ఎకరాల భూమి కేటాయిస్తే రూ.10 కోట్ల విడుదల
» నగరంలో భూమి లేకపోవడంతో పెండింగ్
» రూ.10కోట్ల నిధులతో పాటు 50 ఎలక్ట్రిక్ బస్సుల మంజూరుకు సిద్ధం



సుభాష్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నిజామాబాద్ నగరంలో సిటీ బస్సుల అవసరం ఉంది. ఇప్పటికే సిటీ బస్సులను ప్రవేశపెట్టినా ఆశించిన స్థాయిలో నడవకపోవడంతో సిటీ బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. గత కొన్నేళ్ల క్రితం మినీ బస్సులను సిటీ బస్సులుగా తిప్పిన అధికారులు ప్రజల ఆదరణ లేకపోవడంతో సిటీ బస్సులను రద్దు చేశారు. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కేంద్ర ప్రభుత్వ పథకం ప్రైమ్ మినిస్టర్ ఈ బస్ సేవా పథకం, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ హైవేస్ పథకాల ద్వారా సిటీ బస్సులను నడిపే విధంగా పథకాలను ప్రవేశపెట్టింది. దీంట్లో భాగంగా నిజామాబాద్ నగరానికి సిటీ బస్సులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నగరంలో సిటీ బస్సుల ఆశ మళ్లీ చిగురించింది.

భూమి కోసం వెతుకుతున్నాం

• రాజేందర్ కుమార్, ఆర్డీవో, నిజామాబాద్

నగరంలో సిటీ బస్టాండ్ కోసం 10 ఎకరాల భూమిని ఆర్టీసీ అధికారులు కేటాయించాలని కోరారు. అంత పెద్ద మొత్తంలో నగరంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. ఇప్పటికే నగరంలోని ఉత్తర, దక్షిణ మండల రెవెన్యూ అధికారులను స్థలం వెతకాలని సూచించాం. రెవెన్యూ అధికారులు సైతం ప్రధాన ప్రాంతాల్లో పది ఎకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదని తెలిపారు. ఇంకా అందుబాటులో ఉన్న స్థలాల కోసం వెతుకుతున్నాం.

భూమి ఇస్తేనే నిధులు

రాష్ట్రంలో వరంగల్, నిజామాబాద్ నగరాల్లో సిటీ బస్సుల కోసం బస్టాండ్‌ను నిర్మించేందుకు రూ. 10కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద 50 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నగరంలో 10 ఎకరాల భూమిని కేటాయిస్తే.. నిధులతో ఎలక్ట్రిక్ స్టేషన్, డిపోను నిర్మించేలా నిధులు కేటాయించారు. ఇప్పటికే ఆర్టీసీ ఉన్నతాధికారులు నగరంలో అందరికీ అందుబాటులో ఉండేలా (మిగతా 8లో..)

క్రైం సమాచారం

ఉరేసుకొని యువతి బలవన్మరణం


అనూష (ఫైల్)

మెండోరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గటూర్‌కు చెందిన రెడ్డి అనూష(25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనూష మానసిక సమస్య, తీవ్రమైన తలనొప్పితో, చర్మవ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి అన్న అర్వింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మోర్తాడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపేట్ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాము తెలిపారు. గురువారం ఉదయం కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన పేర్ల కృష్ణ అతడి స్నేహితుడు కోట సాంబయ్యతో కలిసి ఆర్మూర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. గాండ్లపేట్ బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వారిని ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణ(44) మృతిచెందారు. డీసీఎం డ్రైవర్ ప్రభాకర్ అతివేగంగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం జరిగిందని ఎస్సై వివరించారు.

కండక్టర్ బ్యాగ్ నుంచి డబ్బు చోరీ

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కండక్టర్ బ్యాగ్ నుంచి డబ్బులను దుండగులు దొంగిలించిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. భైంసా డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ ప్రధాన బస్టాండ్ నుంచి భైంసాకు వెళ్తుంది. నగర శివారులోకి చేరుకోగానే కండక్టర్ బ్యాగ్‌లో ఉన్న డబ్బులు కనిపించకపోవడంతో బస్సును నిలిపివేశారు. 6వ టౌన్ పోలీస్ దగ్గర బస్సును ఆపి ప్రయాణికులను వాకబు చేశారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఆలస్యం కావడంతో బస్సు బయలుదేరింది. ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే కండక్టర్ తిరిగివెళ్లాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మెండోరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న 4 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అల్లెపు లింబాద్రి, పెనుగొండ శ్రీనివాస్, వేముల రామరాజు, ఓర్పు శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్‌లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్ టౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని మామిడిపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.11,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ప్రదర్శనను విజయవంతం చేయాలి


డొంకేశ్వర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు అభ్యుదయ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే సంఘం చరణం గచ్ఛామి కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ జీవిత చరిత్ర నాటికను సాయంత్రం 6గంటలకు ప్రదర్శినిస్తారన్నారు. నందిపేట్‌లో శుక్రవారం ఆర్మూర్ బైపాస్ రోడ్డులో మున్నూరు కాపు కళ్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గల్ఫ్ టు గల్లీ



స్థానిక సంస్థ ఎన్నికలవేడి గల్లీ నుంచి గల్ఫ్ వరకు చేరింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేదుకు గల్ఫ్ కార్మికులు ఆసక్తి కనబరుస్తున్నారు. బతుకుదెరువుకు గల్ వెళ్లిన వారు గ్రామంలో తమకు అనుకూలంగా రిజర్వేషన్ రావడంతో పోటీచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల బరిలో దిగాలని ఆలోచనలో ఉన్న వారు అక్కడి నుంచి సన్నిహితులతో సమన్వయం చేసుకుంటున్నారు.
- ఆర్మూర్

- పంచాయతీ ఎన్నికలపై గల్ఫ్ కార్మికుల ఆసక్తి
- పోటీకి సిద్ధమవుతున్న యువత
- రిజర్వేషన్లపై బంధువులతో ఆరా
- వచ్చి పోటీ చేసేందుకు మొగ్గు



అభ్యర్థుల పెంపుతో జోరుగా పోరు..

జిల్లాలో ఎన్నికల సందడి మొదలుకావడంతో అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉన్నవారి మద్దతు కూడగడుతున్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పోరు జోరందుకుంది. ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులు త్వరలో గల్ఫ్ నుంచి వచ్చే యోచనలో ఉన్నారు. తమ గ్రామం ఏ విడతలో పోలింగ్ జరగనుంది... రిజర్వేషన్ ఏంటి.. పోటీదారులు ఎవరనేది ఎప్పటికప్పుడు కుటుంబీకులు, స్నేహితులతో సమాచారం రాబట్టుకుంటున్నారు. కొందరు రావడానికి టికెట్లు బుక్ చేసుకున్నట్లు సమాచారం.

సంఘాలను మచ్చిక చేసుకునేందుకు యత్నం

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు యువజన, కుల సంఘాల సభ్యులను మచ్చిక చేసుకుంటున్నారు. తాము బరిలో ఉంటున్నామని మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామాల్లో తమ అనుచరులకు సానుభూతిపరులకు విందులు ఇచ్చే కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

గతంలో 20 ఏకగ్రీవం.. : ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10లక్షలు నజరానా ఇవ్వనుంది. గత ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయితీలకు నిధులు రాకపోవడంతో అప్పటి సర్పంచ్‌లు నిరుత్సాహానికి గురయ్యారు. గతేడాది ఆర్మూర్ సబ్ డివిజన్‌లో సుమారు 20 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ప్రస్తుతం కూడా కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకునేందుకు గ్రామస్థులు ఆలోచనలు చేస్తున్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు తగ్గడంతో పాటు ప్రభుత్వం నుంచి బహుమతి రూపంలో నిధులు వస్తాయని సమాలోచనలు చేస్తున్నారు.


నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

అభ్యర్థుల వివరాలను నమోదు చేయాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

సాలూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల వివరాలను తప్పకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో సబ్ కలెక్టర్ మండలంలోని సాలంపాడ్ క్యాంపు గ్రామంలో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థులకు సంబంధించిన అన్ని వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. క్లస్టర్ పరిధిలో అవగాహన కలిగి ఉన్న ఒక అధికారిని నియమించి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ప్రక్రియ ముగిసిన ఎన్నికల నియమావళి అనుసరిస్తూ ఎంపీడీవోకు సమర్పించాలన్నారు. సందేహాలుంటే ఉన్నతాధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలన్నారు.


నవీపేటలో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంపస్రాద్ లాల్

రెంజల్/నవీపట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎన్నికల నామినేషన్‌లను పరిశీలించాలని, ప్రతి అభ్యర్థి వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్ పరిశీలించారు. రెంజల్, నవీపేట మండలాల్లో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం నవీపేట మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. ఆయన వెంట రెంబజల్ ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో ఆంజనేయులు, జీపీ కార్యదర్శి రాజేందర్‌రావు, నవీపేట తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్ ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

- నిజామాబాద్ కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి


ఎడపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రెంజల్/ఎడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట, ఎడపల్లిలోని నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలను ఏర్పాటుచేయాలని, అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా చ ర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, ప్రలోభాలు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట రెంజల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో రఫీ, ఎస్ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ మన్మోహన్‌శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.


మోస్రాలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

ప్రలోభాలకు పాల్పడితే చర్యలు

- నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

మోస్రా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూసినా, ప్రలోభాలకు పాల్పడినా చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉం చామన్నారు. ఎక్కడైనా ప్రలోభాలకు గురిచేసినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు నీలావతి, శ్రీనివాస్,క్లస్టర్ ఎన్నికల అధికారి నాగనాథ్, కార్యదర్శి శ్రావణ్ ఉన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి

- పోలీసులకు సీపీ సాయిచైతన్య ఆదేశాలు
- నవీపేట మండలంలో పర్యటన


బినోలలో నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య

నవీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్‌ల దాఖలు ప్రక్రియను గురువారం ప్రారంభమైంది. మండలంలోని బినోల నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాన్ని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నామినేషన్ సెంటర్ 100మీటర్ల పరిధిలో నిషేధిత ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు భద్రతను కట్టుదిట్టం చేయాలని సీపీ పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, యాదగిరి గౌడ్, ప్రొసిడింగ్ ఆఫీసర్ అనిత, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్

నందిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గీతా కాన్వెంట్ హై స్కూల్‌లో 4 రోజుల పాటు జరుగనున్న ఉమ్మడి మండల ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రావుతో కలిసి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహగౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్, కోశాధికారి మధు, మండల అధ్యక్షుడు దేవన్న, ప్రధాన కార్యదర్శి నన్ని, కోశాధికారి మురళి తదితరులున్నారు.

మార్చ్ ఫాస్ట్ విజేతలు వీరే..

సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి గ్రేస్ ఫెల్లో చీఫ్ స్కూల్ (వన్నెల్‌-శే), ద్వితీయ బహుమతి సాయి విద్యానికేతన్ (తొండకూర్) జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఉజ్వల హైస్కూల్ (నందిపేట్), ద్వితీయ బహుమతి శ్రీ గీతా కాన్వెంట్ (నందిపేట్) బహుమతులను కైవసం చేసుకున్నారు. అతిథులు వారికి బహుతులు అందజేసి అభినందించారు.


పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో అశోక్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

ఎన్నికల నియమావళి అనుసరించాలి


ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

కమ్మర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ జి.ప్రసాద్, ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ల నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల నియమావళిని అమలుపర్చాలని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, రిటర్నింగ్ అధికారులున్నారు.

ఆలూర్‌లో పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఆలూర్: మండలంలోని కల్లెడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం పరిశీలించారు. కేంద్రాల వద్ద సదుపాయాలు, భద్రతా అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్ఎం మురళి తదితరులున్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

రాష్ట్రస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థి


వాలీబాల్ పోటీలకు ఎంపికైన వెంకట్

జక్రాన్‌పల్లి , నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 వాలీబాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థి యు.వెంకట్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ గురువారం తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 28వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో వెంకట్ పాల్గొంటున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వెంకట్‌ను ఎంఈవో శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరం

మెండోరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోన్‌పేట్‌లో లయన్స్ క్లబ్ బాల్కొండ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహ, కంటి, ఇతర పరీక్షలు చేపట్టారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ప్రతీ ఒక్కరూ రోగాల నివారణకు ముందస్తు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాగర్‌రెడ్డి, చాకు లింగం, యాదగిరి గౌడ్, మల్కేష్, నర్సయ్య, రాములు, రాజశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్న నాయకులు

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

డొంకేశ్వర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి నిరుపేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూమేష్ రెడ్డి అన్నారు. గురువారం నికల్‌పూర్, మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వేల్పూరు సుహాసినికి రూ.46 వేలు, రాజశ్రీకి రూ.18,500, నికల్పూర్‌లో ఇబ్రహీంకు రూ.60 వేలు, సుశీలకు రూ.27 వేల విలువైన చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోక గంగారెడ్డి, సుమన్, బాపురావు, కీనిసిద్ధార్థ, నాగరాజ్, అశోక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు అలవాటు పడొద్దు

నందిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లను అలవర్చుకోవద్దని నందిపేట ఎస్సై జి. శ్యామ్‌రాజ్ కోరారు. గురువారం రాత్రి మండలంలోని వెల్మల్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపి జైలుపాలు కావొద్దని, డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే రూ.10వేలు జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని ఎస్సై కోరారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని, పేకాట అడ్డాలుంటే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు, ఫోన్ నెంబర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై జి.శ్యామ్‌రాజ్ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, తదితరులున్నారు.


వెల్మల్‌లో ప్రజలకు అవగాహన కల్గిస్తున్న ఎస్సై శ్యామ్‌రాజ్

ఘనంగా రథోత్సవం

ఆధ్యాత్మికం


పడిగెల ఆది మల్లన్న జాతరలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేల్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెలలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదిమల్లన్న స్వామి జాతర, రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు ఆదిమల్లన్న స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి చల్లంగా చూడు స్వామి అంటూ వేడుకున్నారు. సాయంత్రం రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన షిడి(రథానికి) తాళ్ల సహాయంతో భక్తులు గుట్ట ఆలయం చుట్టు మూడు సార్లు ఊరేగించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం ఆలయం వద్ద నైవేద్యాలు, రాత్రి నాగవెల్లి, అగ్నిగుండం, శావ తీసే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


కోనాపూర్‌లో పూజలు చేస్తున్న పురోహితులు

కమ్మర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపూర్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులకు గురువారం పురోహితుల మంత్రోచ్చారణల మధ్య భూమిపూజ నిర్వహించారు. గ్రామశివారులోని రాళ్లవాగు ప్రాజెక్ట్ సమీపంలోని గుట్ట వద్ద స్వయంభూ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామాభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. కానీ అది కుదరకపోవడంతో దాతల సహకారంతో భారీ ఖర్చుతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఇందులోభాంగా గురువారం త్రిదండి చిన్నజీయర్ స్వామి శిష్యులు బ్రహ్మశ్రీ మాక్లూర్ రామాచారి, గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ మునుగోటి రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ చేపట్టారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో రామాలయంలో సత్య గణపతి ఆలయ పునర్నిర్మాణం కోసం సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. రూ.20లక్షలతో దాత ప్రియాంక భోజారెడ్డి మండప నిర్మాణం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో షైపాల్, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

రాష్ట్రస్థాయికి ఎంపిక

వేల్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో గురువారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వేల్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ రాష్ట్రస్థాయికి ఎన్నికైందని హెచ్ఎం రాజన్న తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీనిజ జిల్లాస్థాయిలో ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థిని శ్రీనిజతో పాటు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు మురళి కృష్ణను హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయురాలికి సన్మానం

మెండోరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ధర్మంతో విధి నిర్వహణలో విధేయతతో పని చేసిన ఉద్యోగి సురేఖ అని లయన్స్ క్లబ్ సభ్యులు కొనియాడారు. గురువారం మండలంలోని సోన్‌పేట్‌లో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేఖ పదవీ విరమణ పొందడంతో లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. నిత్యం ఉద్యోగి విధేయతతో చేస్తూ.. గ్రామంలో అందరితో మంచి పేరు తెచ్చుకున్న ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లింగం, సాగర్‌రెడ్డి, మల్కేష్, రాజశేఖర్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు సురేఖను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

డిప్యూటీ సీఎం కుమారుడి నిశ్చితార్థ వేడుకలో పోచారం



వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య నిశ్చితార్థ వేడుకల్లో బుధవారం రాత్రి ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్ సాయి ఆలయంలో పూజలు

బాన్సువాడటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్కి చెరువు కట్టపై గల హనుమాన్ సాయి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయిబాబా మూలవిరాట్టుకు అభిషేకాలు, అర్చనలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సాయిబాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాపర్తి సంగమేశ్వర్, సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ శివారులోని చింతల్‌నాగారం నుంచి ఫిల్టర్‌బెడ్ వరకు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న మెటల్ రోడ్డు పనులను గురువారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. అదేవిధంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణంలో కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను సైతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుత్తేదారు పనులను నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసురావాలని సూచించారు. ఆయన వెంట మునిసిపాలిటీ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్, దాసరి శ్రీనివాస్, గౌస్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలానికి సరిహద్దులో మహారాష్ట్ర ఉండటంతో అటు నుంచి వస్తున్న వాహనాలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం మహారాష్ట్రలోని సాంగ్వి నుంచి వస్తున్న వాహనాలకు డోంగ్లి మండలంలోని టాక్లి గ్రామం వద్ద తనిఖీలను నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా డబ్బు మద్యం రాష్ట్రంలోకి వచ్చే అవకాశాలు ఉన్నందున తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. ఎన్నికలు ముగిసేంతవరకు తనిఖీలను నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన



పోతంగల్ జడ్పీ పాఠశాలలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు రాజశేఖర్

కోటగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రముఖ వైద్యులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మనం తీసుకునే ఆహారం ఆరోగ్యంపై ఏ విధంగా ప్రభావం చూపుతుందన్న అంశంతో పాటు అంటువ్యాధులు కాని రోగాలపై వివరించారు. ఆపద సమయంలో సీపీఆర్‌ఎస్ విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. చిరుతిండికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయిలు, లత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, ఇస్రాత్ ఉన్నీసా, రామారావు, నాగనాథ్, నిర్మల, షబానా, సుజలత, చందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల చూపు మొక్కజొన్న వైపు

- కలిసిరాని పత్తి, సోయా పంటలు
- ఈ ఏడాది 7 వేల ఎకరాల్లో సాగు



మద్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు మొక్కజొన్న వైపు దృష్టిసారిస్తున్నారు. గత రెండేళ్లుగా రైతులు మొక్కజొన్న వేస్తూ వస్తు న్నారు. ఈ ఏడాది రైతులు వేసే ప్రధాన పంటలు సోయా, పత్తి కలిసి రాకపోవడంతో మక్క సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన సోయా, పత్తి అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు మొక్కజొన్న వైపు మల్లుతున్నారు. ఈ ఏడాది సోయా, పత్తి పంటలు చేతికొచ్చిన వేళ భారీ వర్షాలు కురవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. తడిసిన పత్తి మూలంగా అనుకున్న స్థాయిలో ధర కూడా రాలేదు. ఎకరానికి 5 క్విం టాళ్ల కంటే పత్తి దిగుబడులు రాకపోవడంతో పెట్టిన పెట్టుబడులు, తెచ్చిన అప్పులు తీరలేదు. ఫలితంగా రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ నష్టాన్ని కొంతమే రకు తగ్గించుకునేందుకు మొక్కజొన్న పంటను పండించేందుకు ఆసక్తి కనబరుస్తు న్నారు.

ఉమ్మడి మద్నూర్‌లో ఇలా..

ఉమ్మడి మండలంలో పెద్దతడుగూర్, కోడిచి ర, సుల్తాన్ పేట్, షేఖాపూర్ గ్రామ రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. 3 నెలల్లో మొక్కజొన్న కోతకు రావడం, మార్కెట్లో ధర అధికంగా ఉండటం, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రైతులు ఈ పంట వైపు ఆసక్తి కనబ రుస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు రావడం, చలి గాలులు వీచడం వల్ల మొక్కజొన్న పంటకు అ నువైన పరిస్థితులు కనిపించడంతో రైతులు ఆ పంట సాగుకు మల్లుతున్నారు.

విత్తనాలు అందించేందుకు ఏజెన్సీలు..

గ్రామీణ ప్రాంతాల్లో పలు ప్రైవేట్ ఏజెన్సీ వ్యా పారులు విత్తనాలను అందజేసేందుకు ముందు కు వస్తున్నారు. ఎకరానికి మొక్కజొన్న పంట కోసం ఆయా ఏజెన్సీ వ్యాపారులు రూ.30 వేల చొప్పున రైతులకు పెట్టుబడి ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. పంట వచ్చిన తర్వాత పెట్టుబడి పెట్టిన ఆయా ప్రైవేట్ ఏజెన్సీ వ్యాపా రులే పంటను రైతుల నుంచి కొనుగోలు చేస్తా రు. మార్కెట్లో ప్రభుత్వం ఏ మద్దతు ధరను ప్ర కటిస్తే ఆ ధరకే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్నలో అనేక రకాలుగా విత్తనాలు, మార్కెట్లోకి వస్తున్నాయి. తీపి రకం మొక్కజొన్నను నేరుగా మార్కెట్లోకి పంపించేందుకు వీలుంటుంది. తీపి మొక్కజొన్న బేబీ కార్న్ మొక్కజొన్న వల్ల కూడా అధిక లాభాలు గడించేందుకు వీలుపడుతుంది. మొక్కజొన్నలో వివిధ రకాల విత్తనాలు మార్కెట్లోకి దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి మండలంలో నీరు ఇంకే నల్ల రేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు నేలలు ఈ మొక్కజొన్న పంటకు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏడు వేల ఎకరాలు అదనం



గత రెండేళ్లుగా ఉమ్మడి మద్నూర్‌లో రైతులు మొక్కజొన్న వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. పంట మార్పిడిలో భాగంగా శనగలో ఎండు తెగులు వ్యాపించి పంటలు అధికంగా నష్టపోతుండటంతో రైతులు మొక్కజొన్నవైపు మళ్లారు. గతేడాది 2,500 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 7వేల ఎకరాలకు పెరిగింది.

- రాజు, ఏవో, మద్నూర్



మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత

కేజీబీవీలో పాఠశాల స్థాయి క్రీడాపోటీలు

నవీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం పాఠశాల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. పీఎంశ్రీ పాఠశాలల స్కూల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా అండర్-17 విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. 8 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత తెలిపారు.

దేశాయి బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వేల్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులను నిలువుదోపిడీ చేస్తున్న దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ బీడీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టీయూసీఐ నాయకులు అరవింద్ డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్ మండల గ్రామాలలో బీడీ కార్మికు లను దోపిడిచేస్తున్న బీడీ కంపెనీలకు సంబంధించి పోస్టుకార్డులపై సంతకాలు చేయించే కార్యక్రమాన్ని బీడీ కార్మికులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. బీడీ కంపెనీ యాజమాన్యం బీడీ కార్మికులకు వేయి బీడీలకు అగ్రిమెంట్ ప్రకారం వేతనం ఇవ్వాల్సింది పోయి వేయి బీడీలకు రూ.పది తక్కువ చెల్లిస్తూ నిలువుదోపిడి చేయడం సరైంది కాదన్నారు. బీడీ కార్మికులు, తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం



నాగిరెడ్డిపేటలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి

నాగిరెడ్డిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి అన్నారు. ఆయన గురువారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి డివిజన్‌లో రెండో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లు, ప్రజలు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న కొందరికి ఓటర్ కార్డులు జారీ అయి, ఓటరు జాబితాలో కొందరి పేర్లు రాలేవన్న విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లగా, ఓటరు జాబితా కోసం 1 జులై 2025 కటాఫ్ డేట్ పెట్టారని ఆయన తెలిపారు. మెదక్ - కామారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామమైన మండలంలోని పోచారం వద్ద ఎస్ఎస్‌టి చెక్ పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చెక్ పోస్టు వద్ద వచ్చి పోయే వాహనాలన్నిటినీ అధికారులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో లలిత కుమారి, సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

79 మంది విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు

వేల్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ద్విత్వాక్షరాలపై నిర్వహించిన పరీక్షల్లో పట్టు సాధించిన 79 మంది విద్యార్థులకు ఎంఈవో రేణుక, హెచ్‌ఎం రాజన్నలు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో పరీక్షలంటే భయం విడనాడి ఆత్మ విశ్వాసాన్ని కల్గించడానికి తోడ్పడుతాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎంఈవో రేణుక

కృత్రిమ మేధస్సును విచక్షణతో వాడుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సును విచక్షణతో వాడుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాలలో గురువారం భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధా యుగంలో విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న అవకాశాలు- అవరోధాలు అనే అంశంపై జాతీయ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సును తెలంగాణ యూని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు, కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్. సాయన్న ప్రారంభించారు. అనంతరం కృత్రిమ మేధపై సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయు వైస్ చాన్స్‌లర్ యాదగిరి రావు మాట్లాడుతూ మానవ మేధకు ఏఐ సహాయం చేసే పరికరం మాత్రమే నని, దానిని విచక్షణతో వాడుకోవాలని అన్నారు. కృత్రిమ మేధ ప్రభావాలను తెలుసుకుని విజ్ఞాన శాస్త్రాలను మానవాళికి మరింత చేరువ చేయాలన్నారు. కృత్రిమ మేధపై సమాజంలో పెరుగుతున్న వివిధ అపోహలను తొలగించి అభివృద్ధిలో అందరిని భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ సాయన్న మాట్లాడుతూ.. ఏఐ తక్కువ శ్రమతో ఎక్కువ సమాచారాన్ని విశ్లేషిస్తుందన్నారు. ఉస్మానియా వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణసాగర్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సూర్యనారాయణ, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ శ్యాం, సమన్వయకర్తలు డా.రామకృష్ణ, భరత్‌రాజ్, గిరిరాజ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.రంగరత్నం, కో ఆర్డినేటర్ రాజేష్, అకాడమిక్ కో ఆర్డినేటర్ నహిదబేగం, పీఆర్‌వో స్వామి, ఏవో రామకిషన్, సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్, అధ్యాపకులు జయప్రసాద్, వేణుగోపాల్, రంజిత, వినయ్ కుమార్, ముత్తెన్న, చంద్ర శేఖర్, ఉమాకిరణ్, విజయ, పద్మ, రాము, వాణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు, కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.సాయన్న



నాగేష్ రెడ్డిని సన్మానిస్తున్న జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

డీసీసీ నూతన అధ్యక్షుడికి సన్మానం

జక్రాన్‌పల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నాగేష్ రెడ్డి కాంగ్రెస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం నిజామాబాద్‌లో కాటిపల్లి నాగేష్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. డీసీసీని సన్మానించి వారిలో నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ సర్పంచ్ కె.నర్సారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్‌నాయక్, మండల మైనార్టీ అధ్యక్షుడు అక్బర్, జిల్లా జనరల్ సెక్రటరీ గన్న లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షుడు అనిల్, నాయకులు తిరుపతి, ప్రభాకర్, కార్తీక్ జలం గాంధీ ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు

ఆర్మూర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీ, విద్యానగర్ కాలనీలో లోవోల్టేజ్ సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరించారు. గత ఆరు నెలల నుంచి కాలనీల్లో లోవోల్టేజ్‌తో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక లైన్‌మెన్ సంతోష్ నాయక్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం 63కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించారు. దీంతో కాలనీవాసులు విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పిప్రి విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

ఆర్మూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అండర్ -18 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నవీన్ కుమార్, పీఈటీ రంగారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వైష్ణవి, అస్మిత లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28 నుంచి సంగారెడ్డి జిల్లాలో జరగనున్న పోటీలలో పాల్గొంటారన్నారు.

సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

ముప్కాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమలులోకి రాకముందు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డీటీఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు యం. బాలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం బాల్కొండ మండలకేంద్రంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. ఎన్‌సీటీఈ ఆగస్టు 2010 లో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని స్పష్టంగా పేర్కొందని చెప్పారు. ఈ నేపథ్యంలో 2010 నోటిఫికేషన్‌ను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం సరైంది కాదని చెప్పారు. తక్షణమే రాబోయే శీతాకాల సమావేశాలలో పార్లమెంట్‌లో టెట్ నుంచి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పిస్తూ చట్టం వేయాలని డిమాండ్ చేశారు. అందుకు రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.దాసు, షేక్ మదర్‌తో ఉమ్మడి బాల్కొండ మండల డీటీఎఫ్ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన

కోటగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో గురువారం డా.రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ పద్ధతిపై వరి విత్తనాలు నేరుగా విత్తడంపై అవగాహన కల్పించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి వీరస్వామి తెలిపారు. డ్రమ్ సీడర్ పద్ధతితో కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు అధునాతన పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు సైతం పెరుగుతాయన్నారు. ఏవో రాజు, ఏఈవో గౌస్, సంస్థ ప్రతినిధులు అరుణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీసీ, రిజిస్ట్రార్‌లు రాజీనామా చేయాలి

నిజామాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ జరిగిన అక్రమ నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. వీసీ, రిజిస్ట్రార్ అండదండలతోనే జరిగిన అక్రమ నియామకాలపై హైకోర్టు డివిజన్ బెంచ్ అప్పీల్‌కు వెళ్లడం, వాళ్లకుస్టే ఇవ్వడం చూస్తే ఇది వర్సిటీ అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందన్నారు. అక్రమ నియామకాల రద్దుపైస్టేఇవ్వడం అంటే యూనివర్సిటీ అధికారులకు చెంపపెట్టు లాంటిదన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ అక్రమ నియమకాలపై వెనక్కు తగ్గబోమని, అవసరమైతే హైకోర్టులో స్టేపై ఇంప్లీడ్ పిటీషన్ వేస్తామన్నారు.

టీయూ డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

నిజామాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీయూ డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. గురువారం జరిగిన డిగ్రీ-సీబీసీఎస్- 1వ, 3వ, 5వ, సెమిస్టర్ (రెగ్యులర్), 2వ, 4వ, 6వ సెమిస్టర్ (2021, 2022, 2023, 2024, 2025 బ్యాచ్‌ల) బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు 30 సెంటర్లలో జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 5,974 మందికి 5,674 విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 5,589 మంది విద్యార్థులకు 5,117 మంది హాజరయ్యారు. కామారెడ్డిలోని మంజీరా డిగ్రీ కాలేజీ ఒకరు, బోధన్‌లోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో ఒకరు డిబార్ అయ్యారు.

బీసీ తిరుగుబాటు సభ జయప్రదం చేయాలి

పెర్కిట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ప్రభుత్వం చేసిన మోసం మీద డిసెంబరు నెలలో నిజామాబాద్ కేంద్రంలో నిర్వహించనున్న బీసీ తిరుగుబాటు మహాసభను విజయవంతం చేయాలని బీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్‌లో గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. బీసీ తిరుగుబాటు మహాసభ విజయవంతం గురించి బీసీ హృదయాలను తట్టి లేపుతున్నామని అందులో భాగంగానే ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశామని తెలంగాణ మలిదశ ఉద్యమం నిజామాబాద్ నుండే ప్రారంభం అవుతుందని అన్నారు. కాంగ్రెస్ వందశాతం రెడ్డిల పార్టీగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయం ఎవరి సొత్తు కాదని బీసీలకు కూడా పా లించే శక్తి ఉందని బీసీలు ఈ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీసీ జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవి, ప్రతినిధులు దేవదాస్, ప్రభాకర్, మహిళా రాష్ట్ర కార్యదర్శి అరుణజ్యోతి, రమ, డివిజన్ అధ్యక్షుడు రుక్మాజీ పాల్గొన్నారు.

బోరు మోటారు బిగింపు



బోరుమోటారు బిగించిన దృశ్యం

పాల్వంచ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కూచని శేఖర్ వేయించిన బోరుకు గురువారం మోటారును బిగించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్య ఉందని చెప్పగానే బోరు వేయించి మోటారును బిగించిన శేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బోరుమోటారు బిగింపుతో పాఠశాలలో నీటి ఇబ్బందులు తొలిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిషేధించాలి



కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సదాశివనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను పూర్తిగా నిషేధించిన రోజే మహిళలకు వివాహాలపై పూర్తి అవగాహన కలుగుతుందని బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు వీణ, సూర్యప్రకాష్ తెలిపారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలు, నిర్మూలనపై ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలు వివరిస్తూ, అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేసి, కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేశారు. డీహబ్ కోఆర్డినేటర్ తులసి, సాధన, ఎన్‌జీవో గిరిజ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వజ్జపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్జపల్లి గ్రామ బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త గాదేపల్లి శివరాజు కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ వజ్జెపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. మృతుడి చిత్రపటానికి నివాళులు అర్పించి మృతుడి కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణులు హరికృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఉచిత వైద్యశిబిరంలో 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వారిలో ఏడుగురిని కంటి శస్త్రచికిత్స నిమిత్తం బాన్సువాడ లయన్స్ ఆస్పత్రి, నేత్ర సమస్య తీవ్రంగా ఉన్న ఇద్దరికి హైదరాబాద్‌లోని సరోజినీ దేవి ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన పీడీఎస్ బియ్యం వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలో సివిల్ సప్లై అధికారులు ఇటీవల నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం వేశారు. వేలం పాట నిబంధనల మేరకు రూ.5వేలు డిపాజిట్ కట్టి నాగం సందీప్, నీల సిద్దరాములు, పూజారి లక్ష్మీనారాయణ పోటాపోటీగా పాల్గొన్నారు. వీరిలో నీల సిద్ధరాములు కిలోకి రూ.17 అత్యధికంగా వేలం వేసి 13క్వింటాళ్ల బియ్యాన్ని దక్కించుకున్నారు. ఈ వేలం పాట ద్వారా రూ. 22,100లు అధాయం వచ్చిందని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచలో ఆరు నామినేషన్లు దాఖలు



పాల్వంచలో నామినేషన్‌ల ప్రక్రియను పరిశీలిస్తున్న సీఈవో చందర్‌నాయక్

పాల్వంచ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. పాల్వంచ మండలంలో పాల్వంచ, ఇసాయిపేట్, ఫరీద్‌పేట్, భవానీపేట్ క్లస్టర్‌లుగా విభజించి నామినేషన్లు స్వీకరించారు. మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 110 వార్డు స్థానాలకు గాను సర్పంచ్ స్థానాలకు ఆరు నామినేషన్లు, వార్డు స్థానాలకు ఆరు నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కాగా పాల్వంచ మండలకేంద్రంలో నామినేషన్ల ప్రక్రియను జడ్పీ సీఈవో చందర్‌నాయక్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

(5వ పేజీ తరువాయి)

రైతుల పక్షనా జాగృతి పోరాటం చేస్తుందని ఆమె తెలియజేశారు. ప్రభుత్వం మహిళలకు రూ.2500ఇస్తామని, పింఛన్‌లు పెంచుతామని పెంచలేదని ఆమె తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కాళేశ్వరం నీటిని ఇస్తామని చెప్పి గత పాలకులు మరిచిపోయారన్నారు.

రైతులకు ఎకరా రూ.50లక్షలు చెల్లించాలి

నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రూ.50లక్షలు ఎకరా ఒక్కింటికి చెల్లించాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా గురువారం నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులో నిర్మితమవుతున్న నాగమడుగు ఎత్తిపోతల పథక నిర్మాణం పనులను ఆమె పరిశీలించారు. ఎకరం ఒక్కంటికి రూ.17లక్షలు చెల్లించాలని ఆమె అన్నారు. పథక నిర్మాణం పైప్‌లైన్లకు భూసేకరణ చేయాల్సి ఉన్నందున సేకరించే భూమికి ఎకరాకు రూ.50లక్షలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని నాగమడుగు ఎత్తిపోతల పథకం ఇప్పటికీ నత్తనడకన సాగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని చెరువులు, బోరుబావుల కిందట 22వేల ఏకరాల కౌలాస్ నాలా ప్రాజెక్టు కింద 9వేలు ఎకరాలు, కౌలాస్ నాలా కింద 9వేల ఎకరాలు సాగుతుందన్నారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్టు లెండీ ఇప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రగతి లేకుండా పోయిందన్నారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం ద్వారా నిర్మితమవుతున్న ఈ పథకం ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటికీ అధికార యంత్రాంగం డీపీఆర్ పద్ధతిని అనుసరించడం లేదని ఆమె అన్నారు. ప్రభుత్వం ఇరిగేషన్‌లో వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. ఈ పథకం కింద భూములు కోల్పోయిన వారు ఉన్నారని ఆ తొమ్మిది గ్రామాలకు రైతులు ఈ పథకం ద్వారా నష్టపోతున్నారని, వారికి రూ.64కోట్ల చెల్లించాలన్నారు. ఈ ప్రాంత రైతులకు నష్టం వాటిల్లితే జాగృతి తరుపున ఉద్యమాన్ని చేపట్టేందుకు వెనుకాడబోమని అన్నారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. బాన్సువాడలోని కొయ్యగుట్ట చౌరస్తాలోని అమరవీరుల స్థూపానికి ఆమె నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఉద్యమకారులకు ఇంటి స్థలాలతో పాటు, గుర్తింపు కార్డులు అందజేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమకారుల పక్షాన పోరాడుతానన్నారు. గురుకులాల విద్యార్థులకు మెరుగైనా వసతులు కల్పించడంతో పాటుగా కాస్మోటిక్ చార్జీలను సకాలంలో ప్రభుత్వం అందజేయాలని కవిత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి అధ్యక్షుడు సంపత్‌గౌడ్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి బాజ లలిత, మండల జాగృతి మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ జాకీర్, మండల మహిళా జాగృతి అధ్యక్షురాలు మ్యాకల పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సిటీ' మారో..

(5వ పేజీ తరువాయి)

భూమిని కేటాయించాలని 4 నెలల క్రితం జిల్లా అధికారులను పలుమార్లు కలిశారు. రాష్ట్రస్థాయి ఆర్టీసీ అధికారులు భూమిని కేటాయించాలని లేఖలు రాశారు. జిల్లా ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించారు.

భూమి లేదట..

జిల్లా కేంద్రంలో ఇప్పటికే నూతన ప్రధాన బస్టాండ్ కోసం గత కొన్నేళ్లుగా భూమి కేటాయించాలని అధికారులు జిల్లా అధికారులను కోరుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రైల్వేస్టేషన్ పక్కన గల స్థలంలో నగర నూతన బస్టాండ్‌ను నిర్మించాలనుకున్నారు. స్థలం సరిపోదన్న ఉద్దేశ్యంతో ఆ ప్రతిపాదనలను ఆపేశారు. మరిన్ని స్థలాల కోసం వెతికినా సరిపోకపోవడంతో నూతన బస్టాండ్ నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే నగరంలో సిటీ బస్సులను తిప్పుకొనే అవకాశం కల్పించింది. రూ.10కోట్ల నిధులను సైతం విడుదల చేసినట్లు సమాచారం. ఈ నిధులతో నగరంలో ప్రధాన స్థలంలో డిపోతో పాటు ఎలక్ట్రిక్ స్టేషన్‌ను నిర్మించి అక్కడి నుంచే సిటీ బస్సులను తిప్పాలనుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో పది ఎకరాల స్థలం అందుబాటులో లేదన్నారు.

భిక్కనూరులో 8 నామినేషన్లు స్వీకరణ

భిక్కనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 8 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి తెలిపారు. వార్డు ఎన్నికలకు 15 దాఖలయ్యాయని, నామినేషన్ కౌంటర్ల వద్ద అన్ని ఏర్పాట్లుచేశామన్నారు.

సదాశివనగర్ బాలికకు బంగారు పతకం



విద్యార్థిని సన్మానిస్తున్న గ్యార సాయిలు

సదాశివనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థినిని మండలంలోని యాచారం గ్రామపాలన అధికారి గ్యార సాయిలు గురువారం సన్మానించారు. గ్రామపరిధిలోని రాంసింగ్ నాయక్ తండాకు చెందిన బానోత్ శ్రీదేవి ఈ నెల 11 నుంచి 15వరకు ఒడిస్సా రాష్ట్రంలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొని బంగారుపతకం సాధించిందని తెలిపారు. గాంధారిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతూ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో బాలిక తల్లిదండ్రులు లలిత శ్రీను, గ్రామస్థులు రమేష్, వాసురాం, దేవి సింగ్, వెంగళ్‌రావు, పూరిబాయి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: ఎస్పీ



పోసానిపేట్‌లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

రామారెడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల దరఖాస్తుల స్వీకరణలో నిబంధనలు పాటిస్తూ గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. గురువారం రామారెడ్డి మండలకేంద్రంతో పాటుగా పోసానిపేట్ గ్రామంలో దఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరు సహకరించాలని, అధికారులు సక్రమంగా పనిచేయాలని అన్నారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

భిక్కనూరు: భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ హుండీని గురువారం దేవాదాయ శాఖ అధికారిణి కమల సమక్షంలో లెక్కించినట్లు ఈవో శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 4 నెలల హుండీ డబ్బులను లెక్కించగా రూ.7.22లక్షలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భిక్కనూరులో ఫిజియోథెరపీ చికిత్సలు

భిక్కనూరు: భిక్కనూరు మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం వైద్యుడు నవీన్‌సాయి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ- విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వలన మానసిక ఉపశమనం కలుగుతుందని, వీరిని క్రమం తప్పకుండా ప్రతి మంగళవారం, గురువారం ఫిజియోథేరఫి శిబిరానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఐఆర్పీ మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి రూ.1,01,118 విరాళం

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మండల పూజ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నప్రసాదానికి రూ.1,01,118 విరాళాన్ని ఆలయ నిర్వహకులకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అందించారు.

అయ్యప్ప స్వాముల మాలధారణ

దోమకొండ: మండలకేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 41 రోజుల అయ్యప్ప స్వామి దీక్షకు 44 మంది స్వాములు మాలాధారణ ధరించారు. నంగునూరు చంద్రశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శ్రీ మనోజ్ పాండే స్వాములకు మాలలో ధరింపజేశారు. జనవరి 5వ తేదీన ఇరుముడి ధరించి శబరిమలై వెళ్లనున్నామన్నారు. డిసెంబరు 10, 11, 12న బ్రహోత్సవాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రలు కావాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘంప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాసమితికి రూ. 11,118 విరాళం

దోమకొండ: మండలకేంద్రంలోని స్థానిక అయ్యప్ప ఆలయంలో గత సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న అన్నప్రసాద సేవాసమితికి దోమకొండకు చెందిన మాజీ సర్పంచ్ నల్లపు అంజలి- శ్రీనివాస్ దంపతులు రూ.11,118 నగదును విరాళంగా అందించారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు తీగల సుదర్శన్‌గౌడ్‌కు గురువారం అందజేశారు. అన్నప్రసాద వితరణ జనవరి 16 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, వినోద్, అబ్బయ్య, సంతోష్, మల్లికార్జున్‌రెడ్డి, నరేందర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

దోమకొండ: దోమకొండ సర్పంచ్ అభ్యర్థిగా గురువారం గ్రామానికి చెందిన పున్న లక్ష్మణ్, ఐరేని నర్సయ్య, నల్లపు శ్రీనివాస్‌లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేర్వేరుగా నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు వారి నుంచి నామినేషన్‌లు స్వీకరించారు, కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొదలైన నామినేషన్ల స్వీకరణ

తాడ్వాయి: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా వివిధ గ్రామాలలో సర్పంచులకు పోటీ చేసే అభ్యర్థులు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మండలంలో మొత్తం 9 సర్పంచు స్థానాలకు నామినేషన్‌లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 2 రోజులు మిగిలి ఉండడంతో వివిధ గ్రామాల్లో నామినేషన్ల పర్వం కొనసాగుతుందని అంటున్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

తాడ్వాయి: స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడతలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి, రామారెడ్డి, సదాశివనగర్, రాజంపేట్ నాలుగు మండలాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జరిగిన సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బీజేపీ కార్యకర్త తమని తాము రాజకీయ శక్తిగా మార్చుకోవడానికి ప్రతి ఐదు సంవత్సరాలకు వచ్చే సువర్ణ అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త సద్వినియోగం చేసుకొని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, నేరెళ్ళ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.మర్రి రామ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావ్, అసెంబ్లీ కన్వీనర్ లింగారావ్, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్, జిల్లా కార్యదర్శులు హోటల్ శ్రీను, హారిక, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ పరీక్షను నిర్వహించాలి

లింగంపేట: మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు ఎఫ్‌ఎల్‌ఎన్ మిడ్‌లైన్ టెస్ట్ పరీక్షను నిర్వహించాలని ఎంఈవో శౌకత్ అలీ అన్నారు. గురువారం లింగంపేట మండలంలోని మెంగారం, శెట్పల్లి ప్రాథమిక పాఠశాలల్లోని రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్ష కోసం 3వ తరగతి విద్యార్థులను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. శెట్పల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బయోసైన్స్ సమావేశానికి హాజరై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ సంగాగౌడ్, రాజు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు భరోసా

లింగంపేట: మండలంలోని భవానిపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బీర్కూరి సాయిలు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మరో కార్యకర్త రాంపురం సాయన్న భార్య మృతి చెందగా ఆయన్ను పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేష్, నాయకులు నర్సింలు, సాయిలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

లింగంపేట: మండలంలోని పొల్కంపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన కందుకూరి రవీందర్‌గౌడ్, నిజ్జన రామలింగం, కర్రె నాగరాజు, బానుపోచయ్య, నిమ్మతోట సత్యలతో పాటు మరికొందరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి అహ్వానించారు.

ఒలంపియాడ్ పోటీల్లో గిద్ద పాఠశాల విద్యార్థుల ప్రతిభ



తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులు

రామారెడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ లాంగ్వేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో మండలంలోని గిద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సృజన, సాహిత్, ప్రదీప్ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచినట్లు ఎంఈవో ఆనంద్‌రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను అభినందించి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణుమాధవ్, కన్నయ్య, మండల కోఆర్డినేటర్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులమంటూ బెదిరింపులు.. ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

కామారెడ్డిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి వద్ద ముగ్గురు వ్యక్తులు తాము పోలీసులమంటూ ఓ వ్యక్తి వద్ద డబ్బులు, మొబైల్ ఫోన్‌ను తీసుకోగా వారిని అరెస్ట్‌చేసి గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. వివరాలు.. మునిసిపల్ పరిధిలోని సరంపల్లి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా కారులో తిరుగుతున్న వారిని పోలీసులు ఆపారు. డ్రైవర్ జింక భాస్కర్ పారిపోయేందుకు ప్రయత్నించాడని అప్రమత్తమైన పోలీసులు భాస్కర్‌తో పాటు కారులో ఉన్న లక్ష్మణ్‌ను పట్టుకున్నారని చెప్పారు. వారిని విచారించగా రాజంపేట మండల కేంద్రానికి చెందిన జింకభాస్కర్, నవీన్‌గౌడ్, లక్ష్మణ్ కలిసి కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఒక వ్యక్తి నుండి రూ.1800, మొబైల్ ఫోన్‌ను పోలీసులమని చెప్పి బెదిరించి బలవంతంగా లాక్కున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ముగ్గురిలో నవీన్‌గౌడ్ పరారీలో ఉండగా భాస్కర్, లక్ష్మణ్ వద్ద నుంచి మొబైల్‌ఫోన్, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన ఫన్ని

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి రాజంపేట మండలంలోని గుడితండాకు చెందిన మెగావత్ ఫన్ని(40) ఎల్లారెడ్డిపల్లి నుంచి గుడి తండాకి వస్తున్న సమయంలో కొండాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఫన్ని తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని చెప్పారు. మృతుడు ఫన్ని భార్య సౌమ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గీతన్నల రణభేరిని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యపేట జిల్లాలో నిర్వహించే గీతన్నల రణభేరి బహిరంగ సభను జిల్లాలోని గౌడ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం కామారెడ్డిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టింపే లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి ఒక పథకం కూడా ప్రవేశపెట్టలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజాగౌడ్, స్వామిగౌడ్, రమేష్‌గౌడ్, సాయాగౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు ఒక్కటై.. గాజుల సవ్వడై

మాచారెడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామంలో అక్కాపూర్‌కు చెందిన మహిళలు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలో ఒకే పాఠశాలలో చదువుకున్న మహిళలంతా గాజుల పండుగను నిర్వహించుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే రకమైన చీరలు ధరించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గాజుల పండుగ సందర్భంగా ఒకే దగ్గర కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. జయసుధ, స్వప్న, లావణ్య, చిట్టి, రజిత, సరిత,వరలక్ష్మీ,భాగ్యపద్మ, నవనీత, చంద్రకళ, సుజాత, బాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ల జోరు

కామారెడ్డిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. ఎవరికి వారు రిజర్వేషన్ల ప్రకారం ఆయా పార్టీల తరపున బరిలో నిలవాలనుకున్న అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు తరలివస్తున్నారు. కామారెడ్డి మండల పరిధిలోని మొత్తం 14 గ్రామాల్లో నామినేషన్ల స్వీకరణను గురువారం చేపట్టారు. కాగా ఈ మండల వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 14 నామినేషన్‌లు రాగా ఇందులో గర్గుల్ గ్రామం నుంచి 4, ఇస్రోజివాడి గ్రామానికి 4, క్యాసంపల్లి గ్రామం నుంచి 3, లింగాయిపల్లి 1, నర్సన్నపలి 1, ఉగ్రవాయి 1, వార్డు స్థానాలకు 15 నామినేషన్‌లు రాగా ఇందులో గర్గుల్ 4, ఇస్రోజివాడి 4, క్యాసంపల్లి 5, ఉగ్రవాయి 2 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో రాణి తెలిపారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రాకింగ్ తాలూకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి రాజు వెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర ఆంధ్రాకింగ్ తాలూకా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230